ప్రజల మాట ప్రగతి బాట

జూబ్లీహిల్స్/సనత్‌నగర్ నియోజకవర్గం

# అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, అక్టోబర్ 10 : దశాబ్ద కాలంలో సనత్‌నగర్ నియోజకవర్గం సాధించిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు దశాబ్ద కాలంలో రూ. 1400 కోట్లకు పైగా నిధులను వెచ్చించినట్లు తెలిపారు. గత పాలకుల హయాంలో నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలను తెలంగాణ వచ్చిన తరువాత ఎమ్మెల్యేగా తాను చేపట్టిన పనులతో సమస్యలను ఏ విధంగా పరిష్కరించామనే అంశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి పార్టీ సీనియర్ నాయకుడు రామేశ్వరం రమేశ్ మంగళవారం ఉదయం మంత్రి తలసానికి ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల్లోకి ఎంతలా దూసుకుపోయిందనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మంత్రిగా కొనసాగిన తన మొదటి ప్రాధాన్యత నియోజకవర్గ అభివృద్ధికేనని స్పష్టం చేశారు. సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్లలో ముఖ్యంగా సుభాష్‌నగర్‌లో ఇళ్లపై వేలాడుతూ పదుల సంఖ్యలో ప్రాణాలను బలిగొన్న విద్యుత్ హైటెన్షన్ తీగల తొలగింపు, తాగునీటి రిజర్వాయర్ నిర్మాణం, ఇండోర్ స్టేడియం, కొత్త కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, ఉన్న వాటికి అదనపు అంతస్తుల నిర్మాణాలు, అమీర్‌పేట్‌లో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాలు నిర్మాణం, ఎల్లమ్మ, కనక దుర్గమ్మ అమ్మ వార్ల దేవాలయాల అభివృద్ధి, వైట్ టాపింగ్ రోడ్లు, పాఠశాలల అభివృద్ధి, క్రీడా ప్రాంగణాల అభివృద్ధితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఆసరా పెన్షన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి అర్హులకు వర్తింపజేలా చూడటంతో పాటు అత్యవసర ఆరోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ చెక్కులతో పాటు రీయింబర్స్‌మెంట్ చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఇంతలా ప్రజల్లో ఉంటూ సేవలందించిన పార్టీ గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలే చెబుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందన్నారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి తమ వంతు బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు.



మంత్రి తలసానిని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు రామేశ్వరం రమేశ్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

## సీఎం బ్రేక్‌ఫాస్ట్ బాగుందా..



శ్రీరాంనగర్ పాఠశాలను సందర్శించి అల్పాహారం గురించి తెలుసుకుంటున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

జూబ్లీహిల్స్,అక్టోబర్10: జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి 'ముఖ్యమంత్రి కేసీఆర్ అల్పాహార' పథకం పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ ఎలా ఉందని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమయానుకూలంగా సరఫరా అవుతుందా అని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 19 వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లు షురూ



కోట్లవిజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని సందర్శిస్తున్న అధికారులు

జూబ్లీహిల్స్,అక్టోబర్10: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి స్టేడియంను జీహెచ్‌ఎంసీ అధికారులు సందర్శించారు. జనరల్ ఎలక్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఎన్నికల కౌంటింగ్ కేంద్రం కోసం ఇండోర్ స్టేడియంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఏఎంసీ, ఏఈఆర్‌ఓ బాలరాజు, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు

వెంగళరావునగర్,అక్టోబర్ 10 : మద్యంతాగి వాహనాలు నడిపిన ఏడుగురు మందుబాబులకు నాంపల్లి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కొమరయ్య తెలిపారు. మంగళవారం ఏడుగురు మందుబాబులైన వాహన డ్రైవర్ల పై చార్జిషీటు దాఖలు చేసి నాంపల్లి కోర్టు లో హాజరుపర్చారు. కేసు విచారించిన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మొదటి సారి పట్టుబడిన నలుగురికి రూ.2100 చొప్పున జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రెండో సారి పట్టుబడిన ముగ్గురికి రూ.3,300 చొప్పున జరిమానా విధించడంతో పాటు నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయని,మద్యంతాగిన మత్తులో వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేసిన వారి పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

## వీధి దీపాలు వెలిగేలా చూడాలి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 10 : కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో విద్యుత్ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ మమత సూచించారు. మంగళవారం జోన్ ఆఫీస్‌లో జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగం, ఈఈఎస్‌ఎల్ కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలలో పలుచోట్ల విద్యుత్ వీధి దీపాలు వెలగడం లేదని తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయని ఈ ఫిర్యాదులన్నింటిని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తాం



జాయింట్ యాక్షన్ టీమ్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్,అక్టోబర్10: అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ డివిజన్ సీఆర్ కాలనీ, నవోదయ కాలనీలలో పర్యటించి జాయింట్ యాక్షన్ టీమ్ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీధి దీపాలు, సీసీ కెమెరాలు, ఫుట్‌పాత్ వ్యాపారాలు, రోడ్డు ఆక్రమణలపై జేఏటీ ప్రతినిధులు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గణపతి కాంప్లెక్స్ సంక్షేమ సమితి నిర్వాహకులు సంపత్ కుమార్, వేణు, ఉష ఎంక్లేవ్ సంక్షేమ సమితి అధ్యక్షుడు శర్మ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

బేగంపేట్ అక్టోబర్ 10: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంది. మార్కెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుజరాత్‌కు చెందిన సంతోష్, అనిత(44) భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం చెన్నైకి వెళ్లి అక్కడే నివాసం ఉండేవారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు పూణెలో ఉంటుండగా చిన్న కుమారుడితో కలిసి ఉంటున్న వాళ్లకు చెన్నైలో సరైన ఉపాధి దొరక్క పోవడంతో నగరంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. వారి సహాయంతో మోండా మార్కెట్ శివాజీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. మసాల ప్యాకెట్లను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా అనిత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుంది. మరో వైపు ఆర్థిక ఇబ్బందులు కూడా తోడయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నివాసంలో బాత్‌రూం క్లీన్ చేసే యాసిడ్ తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కాలుష్య కారకాల నియంత్రణపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

అమీర్‌పేట్, అక్టోబర్ 10 : కాలుష్య కారకాల నియంత్రణకు ఫార్మా పరిశ్రమలు చేపట్టిన తాజా సాంకేతిక చర్యలు, ఉత్తమ పద్ధతులపై మంగళవారం సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ కార్యాలయంలో ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. టీఎస్‌పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట ఇంజినీర్ రఘు అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో దివిస్ ల్యాబ్స్ మాజీ డైరెక్టర్ మధుసూదన్‌రావు దివి, నాట్కో ఫార్మా సీనియర్ జీఎం చిలుకూరి శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ నుంచి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రఘు మాట్లాడుతూ తెలంగాణలో కొనసాగుతున్న 263 ఫార్మా పరిశ్రమలు చేపడుతున్న కాలుష్య నియంత్రణ చర్యలను రియల్ టైమ్ ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా బోర్డు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందన్నారు. ఫార్మా పరిశ్రమలు కూడా పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న, స్థిరమైన విధానాలను చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ తరహా పరిశ్రమల్లో ని యూనిట్లలో ద్రావణాలు, ఆమ్లాలు, క్షారాల వంటి రసాయనాల వినియోగం వల్ల ఏర్పడే రసాయన వ్యర్థాలు ఉద్గారాలు, ఘన వ్యర్థాల రూపంలో పర్యావరణంలో కలుస్తున్నాయన్నారు. అత్యుత్తమ విధానాలతో కాలుష్య కారకాలను నియంత్రించడంతో పాటు ఆర్థిక లాభాలు సాధిస్తున్న అంశాలను కూడా వర్క్‌షాప్‌లో ప్రతినిధులు చర్చించారు.

## అభివృద్ధి.. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 10 : కూకట్‌పల్లిలో ప్రతి ఇంటికి వెళ్లి... ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు... పేదలకు అందిన సంక్షేమ పథకాలను వివరించాలని... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు హ్యాట్రిక్ గెలుపు కోసం కృషి చేయాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే కూకట్‌పల్లి ప్రాంతం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్,బీజేపీ నేతల ఆరోపణలను ఖండిస్తూ...తొమ్మిదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కండ్ల ముందు కనబడుతున్న అభివృద్ధి కారణమైన కృష్ణారావును ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించేలా పనిచేయాలని కోరారు. నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బొట్టు విష్ణు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.